సాక్షి శ్రీకాకుళం

మంగళవారం। 23। సెప్టెంబర్। 2025



అరణ్య రోదన

వంశధార నిర్వాసితుల ఆవేదన అరణ్య రోదనగా మిగులుతోంది. వారికి సాయం అందడం లేదు.

-IIలో



టీడీపీ నాయకుల బరితెగింపు

టీడీపీ నాయకులు బరితెగించారు. కబ్జాలకు పూనుకుంటున్నారు.

-IIలో

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు అక్టోబర్ 7 వరకు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ బి.బేతనసామి సోమవారం ప్రకటనలో వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

కొత్తమ్మ తల్లి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలించి సూచనలు అందజేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి శతాబ్ది ఉత్సవాల్లో భక్తులంతా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా పక్కా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. మంగళవారం నుంచి జరగనున్న ఉత్సవాలకు సంబంధించి సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. మొట్టమొదటి సారిగా భక్తుల కోసం హెలికాప్టర్ రైడ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాగునీరు, వైద్య సదుపాయం, భక్తుల వాహనాలకు అనుకూలమైన పార్కింగ్, ఫైర్ సేఫ్టీ తదితర సదుపాయాల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయనతో పాటు డ్వామా పీడీ సుధాకర్, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఆర్ అండ్ బీ ఎస్ఈ సత్యన్నారాయణ, డీఎస్పీ లక్ష్మణరావుతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

25 నుంచి పీహెచ్‌సీ వైద్యుల నిరవధిక సమ్మె



కలెక్టర్‌కు సమ్మె నోటీసును ఇస్తున్న పీహెచ్‌సీ వైద్యుల సంఘ ప్రతినిధులు ప్రతిష్టా శర్మ బృందం

అరసవల్లి: ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో వైద్యులంతా సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించని పక్షంలో ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మె ఆందోళన కార్యక్రమాలపై కార్యాచరణ చేపట్టేలా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కలెక్టర్‌ను పీహెచ్‌సీ వైద్యుల సంఘ ప్రతినిధులు డాక్టర్ ప్రతిష్ఠాశర్మ (బాతువ), సుమప్రియ (పోలాకి), రమ్య(గార), మౌనిక (లావేరు), మౌనిక (కళింగపట్నం), చాందిని (సింగుపురం) తదితర బృందం కలిసి సమ్మె నోటీసుతో పాటు తమ డిమాండ్లను కలెక్టర్ వద్ద ప్రస్తావించారు. దీంతో మరో కీలక రంగం సమ్మెకు సన్నద్ధమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెకు దిగితే జరగనున్న పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వైద్యుల సంఘం హెచ్చరిస్తోంది.

శరన్నవరాత్రి శోభ

శరన్నవరాత్రులు సోమవారం నుంచి మొదలయ్యాయి. తొలిరోజున అన్ని ఆలయాల్లోనూ అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. మరోవైపు మండపాల్లోనూ దుర్గమ్మను ప్రతిష్ఠించారు.




శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలో ముత్యాలమ్మ తల్లికి అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి వెలమ వీధిలో ఏర్పాటు చేసేందుకు అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



జలుమూరు: పూజలు అందుకుంటున్న అమ్మవారు



ఇచ్ఛాపురం: అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు



పాతపట్నం: బాల త్రిపుర సుందరిగా నీలమణిదుర్గ

అసెంబ్లీని తాకిన ..

కూటమి కుమ్ములాట!

- ఎన్ఈఆర్ వర్సెస్ కూన రవికుమార్
- చిచ్చురేపిన గ్రావెల్, ఇతరత్రా వ్యవహారాలు
- వర్గపోరులో ఆధిపత్యం కోసం వివాదం



సంచాం క్వారీలోని ధ్వంసమైన పొక్లెయినర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమిలో గ్రావెల్ చిచ్చు రేపింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మధ్య రేగిన వివాదం అసెంబ్లీని తాకింది. అసెంబ్లీ ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత సమస్యలకు వేదికైంది. కూటమి అధికారంలోకి వచ్చాక తమ పార్టీ వారికి కాకుండా వేరొకరికి గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చారని బీజేపీ ఎమ్మెల్యే అక్కసు వెళ్లగక్కుతూ.. ఆ క్వారీకి అండగా పక్కనున్న టీడీపీ ఎమ్మెల్యే ఉన్నారని తెలిపారు. ఏకంగా అసెంబ్లీలో ప్రస్తావన వరకు వచ్చిందంటే వీరి మధ్య వివాదం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు వీరిద్దరి నడుమ గ్రావెల్ ఒక్కటేనా.. ఇంకేమైనా వ్యవహారాలు విభేదాలకు దారి తీశాయా? అన్న అనుమానం కూడా కలుగుతోంది.

ఎవరికి వారే..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు, ఇటు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎవరి వ్యవహారాలు వాళ్లు చేసుకుంటున్నారు. అవకాశం మేరకు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదులు, ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. రణస్థలం మండలంలో ఉన్న కంపెనీల దగ్గరి నుంచి ఎచ్చెర్ల మండలంలోని భూముల వరకు వ్యవహారాలు నడిచాయి. అనుచరుల బెదిరింపుల వరకు వెళ్లాయి. ఈ క్రమంలో దారికి తెచ్చుకున్న పరిస్థితులు ఉన్నాయి. అధికారులు సైతం పనిచేయలేక చేతులేత్తేసి, సెలవుపై వెళ్లిపోతామని చెప్పిన రోజులు ఉన్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అలాంటి పరిస్థితులు ఉన్నాయి.

వ్యవహారం నచ్చక..

రణస్థలం మండలంలోని సంచాం కొండలోని గ్రావెల్ తవ్వకాలు ఆ ఇద్దరి ఎమ్మెల్యేల మధ్య వివాదం రేపింది. గుండు కైలాష్ పేరున సంచాం రెవెన్యూలోని 89/6లో సుమారు 7 ఎకరాల వరకు గ్రావెల్ లీజు అనుమతి తీసుకున్నారు. ఈయన దగ్గర ఎమ్మెల్యే కూన రవికుమార్ సోదరుడు కుమారుడు రాజేష్ సబ్ లీజు తీసుకుని నడుపుతున్నారు.

ఆధిపత్య పోరు

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ముఖ్యంగా అంబేడ్కర్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీలో తాత్కాలిక ఉద్యోగుల తొలగింపు దగ్గరి నుంచి నియామకాల వరకు తన మాట చెల్లలేదని బీజేపీ ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు ఆవేదనతో ఉన్నట్టు సమాచారం. ఎమ్మెల్యే కూన రవికుమార్ చెప్పినట్టుగానే అక్కడంతా నడిచిందన్న అభిప్రాయం ఉంది. అలాగే ఎచ్చెర్ల మండలంలో పలు భూ సమస్యలు, కేసులకు సంబంధించి కూడా ఎమ్మెల్యే కూన రవికుమారే అంతా తానై వ్యవహరిస్తున్నారని, తన మాటకు విలువ లేకుండా పోతుందన్న అభిప్రాయంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఉన్నారన్న వాదనలు ఉన్నాయి. టీడీపీలో కింజరాపు అచ్చెన్నాయుడు వర్గమంతా ఎన్ఈఆర్ వైపు ఉండగా, కళా వెంకటరావు వర్గమంతా కూన రవికుమార్ వైపు ఉన్నారు. దీంతో ఆధిపత్య పోరు తప్పడం లేదు. తన నియోజకవర్గంలో కూన రవికుమార్ ఆధిపత్యం చెలాయించడం బీజేపీ ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు నచ్చడం లేదు. ఇక్కడేం జరిగినా తన కనుసన్నల్లోనే జరగాలని, తాను చెప్పినట్టే చేయాలని భావిస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు నాయకుల మధ్య గ్యాప్ పెరిగింది.

ఈ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు ఇష్టం లేదన్న వాదనలు ఉన్నాయి. దీంతో స్థానికుల ముసుగులో ఈయన అనుచరులు అక్కడ తవ్వకాలను అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10న గ్రావెల్ తవ్వకాలకు ఉంచిన పొక్లెయినర్‌ను అర్ధరాత్రి ఎమ్మెల్యే అనుచరులు వచ్చి ధ్వంసం చేశారని, అద్దాలు పగలుగొట్టి, రెండు బ్యాటరీలు, కొన్ని కేబుళ్ల పట్టుకు వెళ్లిపోయారని లీజుదారులు జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే కొండలో గత వారం రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా వేలాది గ్రావెల్ లోడ్లు హైవే పనులకు ఎలా తరలించారని, దీని వెనుక ఎవరున్నారని ఫిర్యాదుదారులు ప్రశ్నించారు. ఈ ఘటన జరిగిన రోజున ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దీంతో ఎన్ఈఆరే ఇదంతా చేశారని ప్రచారం జోరందుకుంది. ఇప్పుడిది ఎన్ఈఆర్‌కు ఇబ్బందికరంగా తయారైంది. దీంతో వ్యక్తిగత సమస్యను ఏకంగా అసెంబ్లీలో ప్రస్తావించారు.

ఇళ్లు, స్కూల్ ముందు వేసిన గ్రావెల్ సంగతేంటి?

ఎన్ఈఆర్ అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాల్లో సంచాం కొండ గ్రావెల్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో తనకెలాంటి సంబంధం లేదని చెప్పడం చర్చనీయాంశమైంది. ఆర్థిక వ్యవహారాల్లో సంబంధం లేదు సరే.. తన ఇళ్లు, స్కూల్ ముందు ప్రాంగణంలో ఉన్న లోతట్టు ప్రాంతాన్ని సమతలం చేసేందుకు తీసుకొచ్చిన గ్రావెల్ ఎక్కడిది? సంచాం కొండ నుంచి కాదా? తన ఇళ్లు, స్కూల్ ముందు టిప్పర్లతో అన్‌లోడ్ చేస్తున్నప్పుడు సంచాం కొండ నుంచి ఎలా తవ్వి తీసుకొస్తారు? అని స్థానికులు నిలదీసింది వాస్తవం కాదా? గ్రావెల్ లోడ్‌తో వచ్చిన టిప్పర్లను ఆ సిబ్బంది సంచాం కొండ నుంచి తీసుకొచ్చామని చెప్పింది నిజం కాదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కార్పొరేట్ల కోసమే పవర్ ప్లాంట్

- ఆలోచన విరమించుకోకుంటే తీవ్ర పరిణామాలు
- బహిరంగ సభలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు



పోరాటాలకు సంఘీభావం తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాలనేతలు

సరుబుజ్జిలి/బూర్జ: పవర్ ప్లాంట్ నిర్మాణం పేరుతో కార్పొరేట్ శక్తులకు భూములు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలు ఐకమత్యంగా తిప్పి కొట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వీఎస్ కృష్ణ పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో అడ్డూరిపేట వద్ద సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకరాపల్లి మాదిరిగా ఇక్కడ ప్లాంట్ జీఓను రద్దు చేయకుంటే ప్రాణాలైనా అర్పిస్తామన్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్లాంట్‌ను రద్దు చేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ గతంలో వెన్నెలవలస వద్ద కూనవారిపూలతోట పేరు మీదుగా తన భార్య పేరుపై 99 ఎకరాల భూమిని లీజు పేరుతో దక్కించుకోవాలని చూశారని థర్మల్ పోరాట కమిటీ కోశాధికారి అత్తులూరి రవికాంత్ తెలిపారు. ఇప్పుడు అన్ని చోట్లా తరిమికొట్టిన ప్లాంట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్నారని విమర్శించారు. 20 గ్రామాల్లో 5వేల ఎకరాల్లో బంగారం లాంటి పంట భూములను కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పెట్టే ప్రయత్నాలను తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. పవర్ ప్లాంట్ వస్తే భవిష్యత్‌తరాలు నాశనమవుతాయని పోరాట కమిటీ కన్వీనర్ సురేష్ దొర హెచ్చరించారు. ఇంటిలో కట్టెల పొయ్యి వల్ల కాలుష్యం జరుగుతుందని గ్యాస్ అందిస్తున్న ప్రభుత్వం థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనుకోవడం హాస్యాస్పదంగా ఉందని ప్రగతి శీలా మహిళాసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. జనం నెత్తిన బొగ్గుల కుంపటి పెట్టవద్దని సీపీఎం నాయకుడు శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, కార్గో ఎయిర్‌పోర్ట్ పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, రైతు కూలీ సంఘం నాయకుడు వంకల మాధవరావు, ఆదివాసీ పరిషత్ జిల్లా కార్యదర్శి సింహాచలం, పోరాట కమిటీ కార్యదర్శి సవర సింహాచలం, గురాడి అప్పన్న, మద్దిలి రామారావు, ఉదయభాస్కర్, తామాడ సన్యాసిరావు, కోత ధర్మారావు, బెలమల ప్రభాకర్ పాల్గొన్నారు.

కొత్తూరు ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు



దివ్యాంగుడైన తన కుమారునితో ఫిర్యాదు చేసేందుకొచ్చిన తొత్తిడి జయమ్మ

శ్రీకాకుళం క్రైమ్ : భూమి ఇవ్వకుంటే ప్రాణాలు తీసేస్తామంటూ తమ కోడలు, ఆమె తరపు బంధువులు తమను బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించాలని ఓ వృద్ధురాలు ఎస్పీ మహేశ్వరరెడ్డిని వేడుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు బాధితుల నుంచి 63 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కొత్తూరు మండలం దాశరథీపురానికి చెందిన తొత్తడి జయమ్మ దివ్యాంగుడైన తన కుమారుడు సింహాచలంతో కలిసి ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా తన కుమారుడికి, కోడలికి విభేదాలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో భూ వివాదాలు జరిగాయని, గత నెల 15న తమ ఇంటికొచ్చి తన కుమారుడిపై దాడి చేయడమే కాకుండా తిరిగి కేసు పెట్టారని ఆమె పేర్కొన్నారు. కొత్తూరు ఎస్ఐ కొంటర్ ఎఫ్ఐఆర్‌లో తమ సంతకాలు తీసుకుని తాము చెప్పిన ఫిర్యాదులో నిజానిజాలు రాయకుండా తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దీనిపై విచారణ జరపాలని ఆమె పేర్కొన్నారు. అలాగే టెక్కలి పంచాయతీ కార్యాలయంలో స్వీపరుగా పనిచేస్తున్న పడాల శ్రీను తాను ఫేస్‌బుక్‌లో స్కూటీ అమ్మకం ప్రకటన చూసి మోసపోయానని, రూ.30వేలు తీసుకుని స్కూటీ ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు చేశారు.

కాసేపు కలవరం



నాన్నమ్మ ఒడిలో ముడుచుకుపోయిన ఈ బాలుడు సోమవారం జిల్లా కేంద్రంలో కాసేపు కలవరం పుట్టించాడు. ఆరేళ్ల వయసు గల యామ్‌దేవ్ ఉదయం పది గంటలకు ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. ఇంటి వాళ్లంతా కంగారు పడుతుండగా అక్కడకు గంట సమయంలో భైరివానిపేట జంక్షన్ వైపు వాహనాల వెనుక పరుగులు పెడుతూ స్థానికులకు కనిపించాడు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలుడిని సురక్షితంగా చైల్డ్‌లైన్‌కు తరలించి తల్లిదండ్రులకు విషయం చెప్పారు. అనంతరం బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఇలా నాన్నమ్మ ఉద్వేగంగా హత్తుకున్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

డీఎస్సీ అభ్యర్థులకు 25న విజయవాడలో నియామక పత్రాలు

శ్రీకాకుళం: డీఎస్సీ-2025లో ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 25న విజయవాడలో నియామక పత్రాలు అందజేస్తారని డీఈఓ రవిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిని శ్రీకాకుళం నుంచి విజయవాడ తరలించేందుకు 37 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, 24 ఉదయం 6 గంటలకు ఇవి బయల్దేరుతాయని చెప్పారు. ప్రతి అభ్యర్థి ఒక సహాయకుడిని తీసుకురావచ్చని, 24 ఉదయం 6 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ బస్సుల ద్వారా వచ్చిన వారికి మాత్రమే నియామక పత్రాలు అందజేసే ప్రాంగణంలోనికి అనుమతిస్తారని తెలిపారు. విజయవాడకు వస్తున్న అభ్యర్థులతో పాటు సహాయకులు ఆధార్ కార్డు, రగ్గు, తలదిండు, గొడుగు, స్వెటర్ తెచ్చుకోవాలని తెలిపారు. గతంలో ఇచ్చిన ఐడీ కార్డులు ఉంటే తీసుకురావాలన్నారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల, సర్వజన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 41 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవుట్ సోర్సింగ్ విధానంపై ఈ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. పోస్టులకు సంబంధించిన వివరాలు అర్హతలు దరఖాస్తు ఫారాలు 23వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అక్టోబర్ 1వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన



నగరంలో ర్యాలీగా వెళ్తున్న విద్యుత్ ఉద్యోగ కార్మికులు

అరసవల్లి: ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ సర్కిల్ ఉద్యోగులు, కార్మికులు సోమవారం నిర్వహించిన శాంతియుత ర్యాలీ విజయవంతమైంది. విద్యుత్ ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీల మేరకు విద్యుత్ పంపిణీ సంస్థల యాజమాన్యాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు వందలాది మంది విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు కదం తొక్కారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎంవీ గోపాలరావు(గోపి), కన్వీనరు జి.రమేష్‌కుమార్, కో చైర్మన్లు ఎంవీ అప్పలనాయుడు, బీవీ గురునాథరావు, పీవీ రమణ, ఎం.శ్రీను, ఎస్.వెంకటరావు, సుబ్రహ్మణ్యం తదితరులు నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వెళ్లి వచ్చేదెలా..?



శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో లోపలకు వెళ్లి బయటకు వచ్చే మార్గం ఒకటే కావడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు ఆ దారిలో ఒకే తలుపు తీయడంతో మరింత ఇక్కట్లకు గురయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

సమస్యల ఏకరువు

- గ్రీవెన్స్‌లో 85 అర్జీల స్వీకరణ



పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్, రైతులు

గ్రీవెన్స్ ఫోకస్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన వినతుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు స్పష్టంచేశారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్‌లతో కలిసి ప్రజల వినతులను స్వీకరించారు. మొత్తం 85 అర్జీలు వచ్చాయి. శుభ్రత పరంగా మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పరిశీలనలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి స్థాయిలో మూడు ప్రదేశాలను ఎంపిక చేసి అక్టోబర్ 2న స్వచ్ఛ అవార్డులు అందజేస్తామన్నారు.

వినతుల్లో కొన్ని..

- వంశధార ప్రాజెక్టు పరిహారం ప్రస్తుత రేటు ప్రకారం చెల్లించాలని ఓవీపేట గ్రామానికి చెందిన శ్రీరామమూర్తి కోరారు.
- శ్రీముఖలింగంలో కాలువ తీత పనులు అధ్వానంగా ఉన్నాయని ఆలయ అనువంశిక అర్చకుడు నాయుడు గారి రాజశేఖర్ ఫిర్యాదు చేశారు.
- జిల్లా వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న 21 మంది ఎంఎస్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలకు గడచిన 23 నెలలుగా జీతాలు విడుదల చేయలేదని, జీతాలివ్వాలని ఉద్యోగులు అనూష, మనీష, సాయి సంతోషి తదితరులు కోరారు.
- శ్రీకాకుళం నగర పరిధిలోని పొన్నాడ బ్రిడ్జిని అనుకొని శ్రీ సాయి శ్రీనివాసనగర్ లేఅవుట్ మధ్య గుండా 45 మీటర్ల రోడ్డు ప్రతిపాదన నిలుపుదల చేయాలని, దీని వల్ల అక్కడి కుటుంబాలకు నష్టం జరుగుతుందని ఫిర్యాదు చేశారు.

'విద్యార్థిని ఆదుకోవాలి'

పొందూరు మండలంలోని కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యార్థి ప్రమాద ఘటనపై తమకు అనుమానాలు ఉన్నాయని, దీనిపై దర్యాప్తు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన జరిగినప్పుడు అక్కడి సిబ్బంది ఏం చేస్తున్నారో తెలపాలని కోరారు. ప్రభుత్వమే విద్యార్థిని చికిత్సకు సాయం అందించాలని, ఎస్ఓపై చర్యలు తీసుకోవాలన్నారు.

మాకూ 'స్త్రీశక్తి' ఇవ్వండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్టీసీలో అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం వల్ల ప్రైవేటు బస్సులు ఎవరూ ఎక్కడం లేదని, తమకు కూడా ఆ పథకాన్ని వర్తింపజేయాలని జిల్లా ప్రైవేటు బస్ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌ను కోరారు.

టీడీపీ కార్యకర్తలకే ఎరువులు

పొందూరు మండలంలోని రైతులకు ఎరువులు అందడం లేదని, టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద ఎరువులు ఉంచుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ కార్యకర్తల ఇంటి వద్ద యూరియా ఎరువు టోకెన్లు ఇస్తున్నారని, ఏఓ పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి ఏఓతో మాట్లాడారు. తుంగపేట, అచ్చిపోలవలస, బొడ్డేపల్లి, లచ్చయ్యపేట రైతులు కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ ఉద్యోగుల సంఘం (ఏపీటీఎస్ఏ) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. దీనిలో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా డి.శ్రీరామ్ కుమార్, జిల్లా కార్యదర్శిగా ఎం.డేవిడ్, జిల్లా కోశాధికారిగా కె.వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.సాయిప్రసాద్, విజయ భాస్కర్ రావ్, అసోసియేట్ అధ్యక్షుడిగా వై.కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

కొబ్బరి అభివృద్ధి బోర్డు బృందం పర్యటన



కపాసుకుద్ది తోటల్లో కొబ్బరికాయలను పరిశీలిస్తున్న సీడీబీ బృందం

కవిటి: రాష్ట్రంలో రెండో కోనసీమగా గుర్తింపు పొందిన ఉద్దానం కొబ్బరితోటల్లో పండిన నాణ్యమైన కొబ్బరిని కొత్త మొక్కల తయారీకి తీసుకునేందుకు జాతీయ కొబ్బరి బోర్డు సంసిద్ధంగా ఉందని ఆ సంస్థ వివిధ రాష్ట్రాల డైరెక్టర్లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కపాసుకుద్ది, ఆర్.భైరిపురం, నెలవంక, సన్యాసిపుట్టుగ గ్రామాల్లోని కొబ్బరితోటలను వారు పరిశీలించారు. ఇక్కడ పండుతున్న కొబ్బరి నాణ్యత ప్రమాణాలు మంచి ఉత్తమ శ్రేణిగా గుర్తింపు పొందాయని తెలిపారు. దీంతో ఈ ప్రాంతంలో ఎంపిక చేసిన 1 లక్ష టెంకాయలను సేకరించేందుకు క్షేత్రపరిశీలన చేశామని తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో సాగవుతున్న కొబ్బరికాయలను చికాఫ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. పర్యటించిన బృందంలో కోకోనట్ డవలప్‌మెంట్ బోర్డ్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ రెడ్డి, ఒడిశా డిప్యూటీ డైరెక్టర్ శరవణ్, వేగువాడ ఫామ్ డైరెక్టర్ రఘోత్తం, కర్ణాటక ఫామ్ డైరెక్టర్ ధన శేఖర్‌లు ఉన్నారు.

విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గార: విశాఖ డెయిరీ పాలు పోస్తున్న రైతుల డిమాండ్ల పరిష్కారానికి ఏపీ పాల రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీపీ గొండు రఘురామ్ పిలుపునిచ్చారు. సోమవారం అంపోలులో పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులకు అందాల్సిన పాల సేకరణ ధర తగ్గించి, సంక్షేమ పథకాలు కొనసాగించకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లీటరుకు రూ.4లు బోనస్ ఇవ్వడంతో పాల సేకరణ ధర రూ.40 లు పైబడి ఉంటే, ఈ ప్రభుత్వంలో ధర తగ్గించి రైతుల నడ్డివిరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల దాణా ధరలు పెరిగిన పరిస్థితుల్లో ప్రభుత్వం, కంపెనీ రైతులకు అండగా నిలబడలేదని దుయ్యబట్టారు. పాలరైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, కౌలు రైతుల సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావులు మాట్లాడుతూ డెయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని కోరారు. పాల సేకరణ ధర పెంచడంతో పాటు ప్రతీ మూడు నెలలకు బోనస్ ప్రకటించాలని, పశువులకు ఉచిత బీమా, మందులు, గడ్డి విత్తనాలపై రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాముకాటుతో విద్యార్థిని మృతి



శ్రీనిధి(ఫైల్)

నందిగాం: మండలంలోని మొండ్రాయివలసలో ఆదివారం అర్ధరాత్రి పాము కాటు వేయడంతో గ్రామానికి చెందిన సీపాన శ్రీనిధి (10) మృతి చెందింది. వివరాలను పరిశీలిస్తే గ్రామానికి చెందిన సీపాన శివ, పవిత్ర దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె రేష్మ, చిన్న కుమార్తె శ్రీనిధి. శ్రీనిధి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి పడుకున్న శ్రీనిధికి అర్ధరాత్రి సమయంలో పాము కాటు వేసింది. కొద్దిసేపటికే శరీరంలో ఇబ్బంది కలగడంతో తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో వీరు వేకువజామున టెక్కలి ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థిని సోమవారం ఉదయం మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.



నిర్వాసితుల మిగులు భూములు

అరణ్య రోదన..!

- వంశధార నిర్వాసితులకు తీరని అన్యాయం
- 20 ఏళ్ల క్రితం రిజర్వాయర్‌కు సర్వం త్యాగం
- మిగిలిన 2,200 ఎకరాల భూములకు వెంటాడుతున్న సమస్యలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయానికి దూరం

హిరమండలం:

వంశధార రిజర్వాయర్ కోసం సర్వం త్యాగం చేశారు వారు. కానీ రెండు దశాబ్దాలు దాటుతున్నా వారి త్యాగాలకు మాత్రం సరైన న్యాయం జరగడం లేదు. వారికి స్వాంతననిచ్చే నిర్ణయం రావడం లేదు. వంశధార రిజర్వాయర్‌కు సంబంధించి మిగులు భూముల విషయంలో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాయితీ రావడం లేదు. వాటికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదు. చివరకు పంటలు పండించేందుకు ఎరువులు కూడా అందించడం లేదు. దీంతో వందలాది మంది రైతుల బాధలు వర్ణనాతీతం. 2005లో వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2007 నుంచి హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల పరిధిలోని 10 వేల ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. 2010లో సేకరణ పూర్తయ్యింది. నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. అయితే రిజర్వాయర్ నిర్మాణానికి ఇచ్చిన భూమి పోనూ.. మిగులు భూమి విషయంలో తలెత్తిన రెవెన్యూ సమస్యలను అధికారులు ఇంతవరకూ పరిష్కరించలేదు. అయితే చేతిలో భూమి ఉందన్న విషయమే తప్ప.. ఆ భూములకు సంబంధించి బ్యాంకు రుణాలు రావడం లేదు. విత్తనాలు ఇవ్వడం లేదు. అన్నదాత సుఖీభవ లాంటి సాగు ప్రోత్సాహం లేదు. ఎందుకంటే మిగులు భూమికి సంబంధించి ధ్రువపత్రాలు, రిజర్వాయర్ నిర్మాణానికి నిర్వాసితులు వదులుకున్న భూములతో లింకు కావడమే. రిజర్వాయర్ కోసం రైతుల నుంచి సేకరించిన భూములు, మిగులు భూములను విడగొట్టకుండా అప్పట్లో అధికారులు సాంకేతిక తప్పిదానికి పాల్పడ్డారు. ఆ శాపం ఇప్పుడు రైతులకు వెంటాడుతోంది.



మిగుల భూముల సమస్యపై జేసీకి వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

చాలా అన్యాయం



ఇంతకంటే అన్యాయం ఉంటుందా..?. రిజర్వాయర్‌కు భూములిచ్చాం. కొన్ని భూములు మిగిలాయి. వాటిపై ప్రత్యేకంగా హక్కు కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ అది తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తోంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

– పెద్దకోట సాదుబాబు, నిర్వాసితుడు, పాదలి నిర్వాసిత గ్రామం

13 గ్రామాలదే సింహభాగం

హిరమండలం మండలం పాదలి, దుగ్గుపురం, తులగాం, పెద్దసంకిలి, గార్లపాడు, చిన్నకొల్లివలస తదితర 13 గ్రామాల రైతులు వేలాది ఎకరాలను వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ నిర్మాణానికి వదులుకున్నారు. రిజర్వాయర్‌లో సింహభాగం భూమి ఈ గ్రామాల వారిదే. ఆ సమయంలో రిజర్వాయర్ ఎగువున ఉన్న భూములను మిగులు భూములుగా గుర్తించారు. వాటిని రైతులకు విడిచిపెట్టారు. అయితే ఇక్కడ ఒక చిక్కొచ్చిపడింది. ఒకే సర్వే నంబర్, వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూమి రిజర్వాయర్‌కు ఇచ్చిన దాంట్లోనూ.. మిగులు భూమిగానూ ఉంది. అప్పట్లో రెవెన్యూ రికార్డులు విభజించకుండా పూర్తి చేశారు. దీంతో అదంతా రిజర్వాయర్ భూమి పరిధిలో ఉండడంతో దాదాపు 2,200 ఎకరాల మిగులు భూములకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏ పథకమూ వర్తించడం లేదు. ఇలా పథకాలు దక్కని మిగులు భూములకు సంబంధించి పాదలిలో 264 ఎకరాలు, దుగ్గుపురంలో 180, అంతిలిలో 1,200, పెద్దసంకిలిలో 220, గార్లపాడులో 150, చిన్నకొల్లివలసలో 100 ఎకరాలు ఉన్నాయి. అయితే ఈ రైతులంతా తహసీల్దారు, జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాలు అందించుకోవడమే తప్ప సమస్యకు మాత్రం పరిష్కార మార్గం దొరడకం లేదు. అందువలన ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

న్యాయం జరుగుతుంది



వంశధార నిర్వాసితుల మిగుల భూముల సమస్య ఎప్పటినుంచో ఉంది. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. తప్పకుండా ఉన్నతాధికారులు పరిష్కారం చూపుతారు. నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది.

– ఎ.జోగారావు, తహసీల్దారు, హిరమండలం

మా గోడు పట్టదా..?



వంశధార ఫేజ్-2 రిజర్వాయర్ కోసం సర్వం త్యాగం చేశాం. కానీ మా త్యాగాలకు విలువ లేకుండా పోయింది. మిగులు భూముల సమస్యలు పరిష్కరించాలని గత 15 సంవత్సరాలుగా కోరుతూనే ఉన్నాం. కానీ మా గోడు వినిపించుకునే వారు కరువయ్యారు.

– గొర్లె చంద్రినాయుడు, నిర్వాసితుడు, దుగ్గుపురం నిర్వాసిత గ్రామం

గోవులను సంరక్షించాలని పాదయాత్ర



రాహుల్ చౌదరిని ఆహ్వానిస్తున్న దృశ్యం

కంచిలి: గోవులను సంరక్షించాలని నినదిస్తూ రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లా జ్యోతిర్యాలీ గ్రామానికి చెందిన రాహుల్ చౌదరి ఏడాది కాలంగా పాదయాత్ర చేస్తున్నారు. దీనిలో భాగంగా కంచిలి పట్టణానికి ఆదివారం రాత్రి చేరుకున్నారు. ఇతడిని స్థానిక హిందూ ధార్మిక ప్రతినిధులు ఆహ్వానించి బస ఏర్పాటు చేశారు. తన పాదయాత్రను ఉత్తరాఖండ్‌లో ముగింపు చేయనున్నట్లు రాహుల్ చౌదరి తెలిపారు. అనంతరం దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి గోవులను జాతీయ చిహ్నంగా గుర్తించాలని కోరనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 9,500 కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లు తెలిపారు. ఇతడిని కంచిలికి చెందిన జగదీష్ పట్నాయక్, ఇప్పిలి ప్రవీణ్, వూనా శ్రీకాంత్, కొత్తకోట విజయబాబు, కొంచాడ కామేష్, హరేరామ భక్తుడు ధర్మ, ఎస్ఆర్‌సీపురం పాఠశాల ఉపాధ్యాయుడు ముకుంద తదితరులు కలిసి సంఘీభావం తెలుపుతూ, కొంత ఆర్థిక సాయం అందించారు.

విద్యారంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

శ్రీకాకుళం:

ప్రపంచ బ్యాంకు అప్పుతో నడుస్తున్న సాల్ట్ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్న విద్యారంగ సంస్కరణల వలన వచ్చిన లాభనష్టాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తీసుకొచ్చిన అప్పుతో విద్యారంగ సంస్కరణల్లో ఆశించిన లక్ష్యం నెరవేరిందా లేదా అనే అంశంపై ఒక స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం అనేది వాస్తవమా కాదా అనేది ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. గిన్నిస్ బుక్ రికార్డుల కోసం పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను వినియోగించుకుంటూ బెదిరించడం, కించపరచడం తగునా అని ప్రశ్నించారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన్ రావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో స్వేచ్ఛా బోధనకు అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ సెప్టెంబర్ 25న గుంటూరులో జరుగుతున్న రణభేరీ కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల జాబితా ఖరారైంది. ఇటీవలి శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 నాలుగు వయో విభాగాల్లో 80 మంది బాలబాలికలను వేరువేరుగా ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి విడుదల చేశారు. క్రీడాకారుల బృందానికి కోచ్ మేనేజర్లుగా ఇ.అప్పన్న, రామయ్య, చల్లారాజు వ్యవహరిస్తారని చెప్పారు.

27 నుంచి ఏలూరులో పోటీలు

ఇదిలా ఉండగా జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఏలూరు వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులంతా ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ వద్దకు తమ లగేజీతోపాటు టెన్త్‌క్లాస్ సర్టిఫికెట్/వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడు పాస్ ఫొటోలతో చేరుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 85002 71575 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పని గంటల పెంపు సరికాదు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మికులంతా కలిసి సాధించుకున్న పని గంటలను 8 నుంచి 10కి పెంచుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావులు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపునకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం.గోవర్ధనరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, స్మార్ట్ కం ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బి.జనార్ధనరావు, నీలం జూట్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరకయాతన..!

- వైద్యుని రాకకోసం దివ్యాంగుల ఎదురుచూపులు
- పలాస ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సదరం ఇక్కట్లు



వైద్యుడి కోసం ఎదురు చూస్తున్న దివ్యాంగులు

పలాస: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద దివ్యాంగులకు సదరం ఇక్కట్లు అంతా ఇంతా కాదు. సంబంధిత వైద్యుడు సమయానికి రాకపోవడంతో గంటల కొద్దీ ఎదురుచూడాల్సిన పరిస్థితి సోమవారం నెలకొంది. అక్కడ సరైన సదుపాయాలు కూడా లేకపోవడంతో నరకయాతన అనుభవించారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. పలాస సామాజిక ఆస్పత్రి వద్ద ప్రతీవారం సదరం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల కోసం ఇచ్ఛాపురం మొదలుకొని పలాస వరకు పలాస రెవిన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చే వారికి వారానికి 30 మందికి చొప్పున పరీక్షలు చేయాల్సి ఉంది. గత వారం సదరం పరీక్షలు జరగలేదు. దీంతో సోమవారం మొత్తం 60 మంది వివిధ రకాల దివ్యాంగులు ఉదయం 7 గంటలకే ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించిన వైద్యుడు డాక్టరు చిన్నంనాయుడు ఉదయం 9 గంటలకు రావాల్సి ఉంది. అయితే ఆయన ఆస్పత్రికి వచ్చి వెంటనే బయటకు వెళ్లిపోయారు. డాక్టర్‌ను అక్కడికి వచ్చినవారు చూశారు. ఇక పరీక్షలు చేస్తారని సంతోషపడ్డారు. అయితే అంతలోనే అక్కడ నుంచి అతను మాయమైపోయారు. దీంతో అతని కోసం సుమారు 2 గంటల పాటు ఎదురుచూశారు. అక్కడ వైద్య సిబ్బందికి అడిగితే.. వస్తారని చెబుతున్నారు గానీ రాకపోవడంతో వికలాంగులు నరకయాతన అనుభవించారు. కనీసం అక్కడ ఫ్యాన్లు, కుర్చీలు లేవు. మలమూత్ర విసర్జాలకు కూడా బయటకు వెళ్లలేరు. ఈవిధంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత నింపాదిగా సుమారు 12 గంటల సమయంలో వైద్యుడు చిన్నంనాయుడు వచ్చి పరీక్షలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి సుమారు 60 మంది వికలాంగులు ఈ సదరం పరీక్షలకు వచ్చారు. ఈ విషయంపై వైద్యుడు చిన్నంనాయుడుని వివరణ కోరగా తాను ఒక గంట ఆలస్యంగా రావడం వాస్తవమేనని, అయితే వచ్చిన 50 మందికి పరీక్షలు ఒంటిగంటలోపే చేశామని తెలియజేశారు.

చాలా ఇబ్బంది పడ్డాం



వైద్యుడు సమయానికి రాకపోవడం చాలా ఇబ్బంది పడ్డాం. మా ఇంట్లో మా బావ కొడుకు చనిపోయాడు. అక్కడకి వెళ్లలేని.. ఇక్కడ ఉండలేని పరిస్థితి. మా బాబు కదల్లేడు. కవిటి నుంచి వచ్చాము. మా ఇబ్బందులు ఆ దేవుడుకు తెలుసు.

– బృందావతి, సహాయకురాలు, సిగలపుట్టుగ, కవిటి మండలం

కనీస సదుపాయాలు లేవు



డాక్టర్ కోసం ఉదయం 7 గంటలకు వచ్చాను. ఎప్పుడు వస్తారా అని ఎదురు చూసుకొని ఉన్నాను. కనీసం మూత్రం పోయడానికి కూడా బయటకు వెళ్లలేని పరిస్థితి. అక్కడ ఉండడానికి కనీసం కుర్చీలు కూడా లేవు. నరకయాతన అనుభవించాము.

– యజ్జల వెంకటరావు, బారువ, సోంపేట మండలం

బకాయిలపై ఆందోళన వద్దు

- జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు మధుసూదనరావు



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకుడు మధుసూదనరావు

ఎచ్చెర్ల: విద్యార్థులకు విడతలవారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల త్వరలో చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, దీనిపై ఆయా కళాశాలల యాజమాన్యాలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకుడు మధుసూదనరావు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో వర్సిటీలో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్ఞానభూమి పోర్టల్‌లో వివిధ సాంకేతికపరమైన మార్పులు, విద్యార్థుల బయోమెట్రిక్ పెండింగ్ వంటి సమస్యల వలన ఫీజు బకాయిల మంజూరులో జాప్యం వస్తోందన్నారు.

కోర్సుల నిర్వహణలో కొత్త మార్గదర్శకాలు

వీసీ ఆచార్య కేఆర్ రజనీ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలు, కోర్సుల నిర్వహణలో కొత్త మార్గదర్శకాలు వచ్చాయన్నారు. ఇంటర్న్ షిప్ కాల వ్యవధి తగ్గింపు, క్వాంటమ్ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్ వంటి నూతన బోధనాంశాలు అమలు జరగనున్నట్లు పేర్కొన్నారు. సీడీసీ డీన్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ అపార్ ఐటీ నమోదు కార్యక్రమం పూర్తిస్థాయిలో జరిగేలా కళాశాలలు చొరవ తీసుకోవాలని సూచించారు. వివిధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతీ ఏడాది బయోమెట్రిక్ పరికరాల్లో మార్పులు తెస్తున్నందున పలు సమస్యలకు ఆస్కారం ఏర్పడుతోందన్నారు. 2023 విద్యా సంవత్సరం నుంచి ఏడు విడతలుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించి, ఉన్నత విద్య గాడిలో పడేటట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ డా.కె.స్వప్నవాహిని, ఎస్‌వో డా.కె.సామ్రాజ్యలక్ష్మీ, యూజీ పరీక్షల డీన్, అసిస్టెంట్ డీన్‌లు డా.జి.పద్మారావు, డా.కె.ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో యువకుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో 15.080 కేజీల గంజాయితో యువకుడిని అదుపులోకి తీసుకున్నామని సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణ పోలీసుస్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐ వి.రవివర్మ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రైల్వేస్టేషన్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తమిళనాడుకి చెందిన అజయ్ అనే యువకుడు 15.080 కేజీల గంజాయితో పట్టుబడ్డారు. నిందితుడిని విచారించి తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా మేళకొండై గ్రామానికి చెందిన అజయ్‌గా గుర్తించారు. యువకుడు మైదానంలో ఆడడానికి వెళ్లేటప్పుడు అతనికి గంజాయి వ్యాపారం చేసే విగ్నేశ్వర్ అలియాస్ విక్కి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని విక్కికి అజయ్ చెప్పాడు. దీంతో ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చేందుకు తనకు సహకరిస్తే సేవించడానికి గంజాయితో పాటు అదనంగా రూ.5 వేలు ఇస్తానని విక్కి చెప్పాడు. దీనికి అజయ్ అంగీకరించి ఈనెల 14వ తేదీన బయల్దేరి రైలు ద్వారా తమిళనాడు నుంచి ఒడిశాలోని బరంపురం వచ్చారు. అనంతరం మోహన ప్రాంతంలో ధాడ్‌ధీర అలియాస్ దీరజ్ అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. అక్కడి నుంచి బరంపురం రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండడం గమనించి, బరంపురం నుంచి బస్సు ద్వారా ఇచ్ఛాపురం చేరుకున్నారు. వీరిలో అజయ్ రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి బ్యాగుతో వేచి ఉండగా విక్కి రైలు టికెట్ తీసేందుకు స్టేషన్‌కి వెళ్లాడు. ఈ క్రమంలో స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించేందుకు వచ్చిన పట్టణ పోలీసులకు అజయ్ గంజాయి బ్యాగుతో పట్టుబడ్డాడు. ఇతని వద్ద నుంచి గంజాయి, కీప్యాడ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకుల బరితెగింపు



పెద్ద కోనేరు చెరువును జేసీబీతో చదును చేయిస్తున్న ఆక్రమణదారులు

- కొత్త కుంకాంలో చెరువు ఆక్రమణ
- రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- హెచ్చరికలు బేఖాతరు చేస్తున్న వైనం

రణస్థలం: కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు బరితెగిస్తున్నారు. ఇటీవల టీడీపీ నాయకులు గ్రావెల్ దందా చేసి సొమ్ము చేసుకుంటే.. నేడు ఆ పార్టీ కార్యకర్తలు ఏకంగా చెరువులనే కబ్జా చేస్తున్నారు. లావేరు మండలంలోని కొత్తకుంకాం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కొత్త కుంకాం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 55లో పెద్ద కోనేరు చెరువు ఉంది. ఈ చెరువు మధ్యువలస కాలువ వలన రెండు పాయలుగా చీలిపోయింది. ఒకవైపు సుమారు రెండు ఎకరాల పరిధిలో ఉన్న చెరువును స్థానిక టీడీపీ నాయకులు ఆక్రమించే చర్యలు చేపట్టి ఇప్పటికే ఎకరా వరకు కప్పివేశారు. ఉన్న మరో ఎకరాను పూర్తిగా ఆక్రమించే చర్యలు గత పదిహేను రోజులుగా చేపట్టారు. దీనిపై గ్రామంలో ఎంత వ్యతిరేకత వచ్చినా కనీసం స్పందించకుండా టీడీపీ కార్యకర్తలు వాళ్ల పని వాళ్లు చేసుకుంటున్నారు. కొందరికి మాత్రం ఊరులో ఉన్న కోవెల ఆదాయం కోసం మొక్కలు వేసి సాగు చేస్తామని చెబుతున్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఈనెల 8వ తేదీన కలెక్టర్ గ్రీవెన్స్‌లో స్థానిక గ్రామస్తుల తరుపున ఒక వ్యక్తి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా ఉంది. చెరువును కూనపల్లి కిషోర్ కుమార్, బత్తుల గిరిబాబులు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ మేరకు రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా పరిశీలించి వెళ్లిపోయారు. మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తూ మరలా సోమవారం నుంచి టీడీపీ నాయకులు ఆక్రమించే చర్యలు చేపట్టారు. దీనిపై గ్రామస్తులంతా కలిసి అధికారులకు సమాచారం అందించినా ఫలితం లేకుండా పోయింది. ఫిర్యాదు అందిందని ప్రస్తుతం పనులు ఆపించాం. వర్షం పడుతుంది పోలీసుల బందోబస్తుతో వెళ్తామని రెవెన్యూ అధికారుల ఒక వైపు చెబుతుంటే... ఏ రెవెన్యూ అధికారి వచ్చినా ఆపేది లేదని టీడీపీ ఆక్రమణదారులు సవాల్ విసురుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

చెరువు ఆక్రమణకు సంబంధించి గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. సరిహద్దులు నిర్ధారించి ఆక్రమణలు నిజమని తేలితే తొలగిస్తాం. ఉపాధి హామీ పనులు చేపట్టి చెరువును అభివృద్ధి చేస్తాం.

– జీఎల్ఈ శ్రీనివాసరావు, తహసీల్దార్, లావేరు



కబ్జా కోరల్లో చిక్కుకున్న పెద్ద కోనేరు

మూతపడ్డ ప్రైవేటు డిగ్రీ కళాశాలలు



నిరసన తెలుపుతున్న ప్రైవేటు కళాశాల యాజమాన్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ప్రైవేటు డిగ్రీ కాలేజీలు సోమవారం మూతపడ్డాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు కాలేజీల్లో తరగతులను రద్దుచేసి కాలేజీలను మూసివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖామంత్రిని పలుమార్లు కలిసినప్పటికీ న్యాయం జరగకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో కాలేజీల్లో క్లాసులను రద్దు చేయాలని నిర్ణయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం స్పందించినవరకు కాలేజీల్లో క్లాసులను రద్దు చేయాలని నిర్ణయించినట్టు ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.జయరాం పేర్కొన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖామంత్రి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.